అమ్మా నాన్నా బిక్క మొహాలతో ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

“అన్నం చల్లారిపోతోంది,” అంది చెవిటిఅవ్వ, గుమ్మందగ్గిరికివచ్చి. అమ్మనీ నాన్ననీ చెరోచే త్తోనూ పుచ్చుకుని వంటింట్లోకి నడిచాడు వసంత్.

ఆసాయంత్రం వసంత్ ఆటలనుంచి తిరిగి వచ్చే టప్పటికి సొరుగులో ఆరు పెన్సిళ్ళూ, తలగడకింద ఆరుపెన్సిళ్ళూ వున్నాయి.

(అక్టోబరు 44)

---

# రైలులో

పూనాస్టేషనులో మా వాడు నన్ను రయిల్లో దూర్చాడు. ఈ రయిలువాళ్లు—మీరు ప్రయాణం చెయ్యుద్దో!—అని అఘోరిస్తున్నారు కనక, స్తలం లేదనే కంప్లయింట్ అనుచితం. టికెట్ దొరక డమే మహాద్భాగ్యం.

నేనంటే దూరాను గాని నా పెట్టె, హోల్డాలూ, కారియరూ ఎలా? నోట్లో ఈలా, చేతిలో జండాతో గార్డు యములాడిలా, రెడీగా వున్నాడు. మా వాడు

పెట్టెబిగాద హోల్డాలు పెట్టి, ఆ మొత్తాన్ని కిటికీలో నుంచి తోసేస్తున్నాడు. లోపల కూచున్న ఒక తల పాగామనిషి ఆ వస్తువుల్ని బయటికి నెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. తలపాగామనిషి తలతిక్కకి మా వాడు వుద్రేకుడై పోయి, సామానుకి ఒక్క పుష్ యిచ్చాడు. తల్లి వొళ్లో కూచున్న ఒక నాలు గేళ్ల పిల్ల ఈ మోడరన్ ముష్టియుద్ధపరిణామానికి కెవ్వుమని అరిచింది. కోటఛేదించిన వీరత్వంతో సామానూ, రైల్వే అడ్వర్టయిజ్ మెంటుప్రకారం నా వెంట సతతమూ వుండే కారియరూ నన్ను జేరాయి.

"వెళ్లగానే ఉత్తరం రాయేం!" అన్నాడు మా వాడు.

"మన వాళ్లందర్నీ అడిగానని చెప్పేం!" అంటున్నాను నేను.

వల్లూరి జగన్నాథరావుగారి ప్లేటు జ్ఞాపకం వచ్చింది. 'ఈరోజుల్లో పెళ్ళాలు తప్పిపోరు—పారి పోతారు.' అంత పొడుగు బండికీ రాజైన గార్డు బిగిల్ వూదాడు. పెట్టెలలో చైతన్యం కలగ నారంభిస్తోంది. రయిల్ నన్నూ మా వాణ్ణీ వేరు చేసేస్తోంది. పొయిట్రీకి అవకాశంలేని పరిసరాలు—

అంచేత మా వాణ్ణి గురించిన తలంపు, అతను నా దృష్టినుంచి జారిపోగానే తొలగిపోయింది.

పదకొండు అయింది. సాయంత్రం అయిదు గంటల దాకా నేనా రైలుపెట్టెలో మకాం చెయ్యాలి. అంత సేపూ నుంచుంటానా ?- చిన్నప్పుడు బళ్ళోకూడా నుంచోలేదే! ఎవర్ని స్థలమడుగుతాను భాషరాని ప్రదేశాల్లో ?

చుట్టూరా చూశాను. దూరాన్నుంచి ఒక కాకిగుడ్డల మనిషి నన్ను రమ్మని సంజ్ఞ చేస్తున్నాడు. వచ్చినా రైలుపెట్టెలో సందు యివ్వమని ఆర్భాటం చేసే జాతికి నా మీద ఏ కారణం వల్ల కరుణ కలిగిందా అనుకుంటూ వాళ్ళవైపు, ఆంజనేయుడి అంగలతో వెళ్ళాను.

వాళ్లు ముగ్గురు. తెలుగువాళ్లు. ముగ్గురూ తొమ్మండుగురి స్థలం ఆక్రమించుకున్నారు. న్యాయసూత్రాలు నేను వారికి చెప్పానా- మాకు తెలీదు మా కంపెనీకి రాసుకో - అంటారు. న్యాయం మాట దేవుడెరుగును, ముందు నా సీటూ, వారు నా మీద చూపే ఆప్యాయతా హుళక్కి అవుతాయి.

కడుపు చేతిలో పుచ్చుకొని బొంబయి వచ్చిన

ముగ్గురు భారతీయులు వీరు. ఒకడిది నంద్యాల, మరొకడిది విజయనగరం, మూడోవాడి వూరు పేరు మర్చిపోయాను. అంచేత అతన్ని జకరయ్య-అంటాను. వూనాస్టేషనులో తెలుగు మాట్లాడే నన్ను చూడగానే వారికి ప్రాణం లేచివచ్చి నట్లయింది.

తాను పరుచుకున్న బెడ్డింగు మీద నన్ను ఆశీనుణ్ణి చేశారు. నన్ను మర్యాద చేసేందుకు నానా యిబ్బంది పడటం మొదలెట్టారు ముగ్గురూను. వాళ్ళ ఆకారాల గురించీ వైఖరీ గురించీ చెప్పడమనవసరం. నిత్యమూ కనిపించే ఖాకీసరుకు లో యివి మరో మూడు - దేశీయరక్షణాసైన్యం లోని అంగాల బాపతు.

ఒకడు సిగరెట్టుపాకెట్ ఆఫర్ చేశాడు. మరొకడు నా నిమిత్త్యర్థం జామపళ్ళు కొన్నాడు. మూడోవాడు నా దగ్గిర తెలుగు పుస్తకాలేవైనా వుంటే, చదువుకునేందుకు యివ్వమన్నాడు. 'పుస్తకం - వనితా-విత్తం' ఇలాంటి ఆర్యోక్తులు పత్రికల్లో బాగా చదివివున్నవాణ్ణి అవడంచేత, ఏం జవాబు చెప్పనా అని ఆలోచిస్తూ వుండగానే, నా ఆలోచన ఒకకొనకి తేలక పూర్వమే ఆ మహా

సుభావుడు "కాతలనాటి క్షేత్రములు..." అంటూ అందుకున్నాడు. ఆ బాక్‌గ్రవుండ్ మ్యూజిక్‌కి నా పాసింగ్‌షో పొగలు నాట్యమాడాయి.

"జామపండ్లు నాకు నయించవు," అన్నాను, అణాకొకటి చొప్పున కొని, నాకు అరడజను ప్రజంటు చేసిన నంద్యాలమనిషితో.

"మీరు తినాలి, సార్!" అన్నాడు.

మా దొడ్లో ఒక జామచెట్టువుంది. అది ప్రతి సంవత్సరమూ విరగకాస్తుంది - అంచేత నాకు జామపళ్ళు నయించవు. వాసన కూడా గిట్టదు.

"తర్వాత తింటాను," అంటూ పక్కని పెట్టాను, ఆ ఫలాలు

నేను వాళ్ళ పేర్లు అడగలేదు. ఎంచేతనంటే, పోలీసువాళ్ళకీ మిలిటరీవాళ్ళకీ పేర్లు జీవించివుండవు. వారికుండేవి నెంబర్లే. "తొమ్మిదిపైన అంతా అయోమయమే!" అనే వేదాంతుల మాటల్లో నాకు విశ్వాసం పోలేదు.

"మీరు ప్లీడరీపరీక్ష యిచ్చివచ్చారా?" అన్నాడు, విజయనగరం.

ఇంకా నాకా దౌర్భాగ్యం పట్టలేదని మనసులో అనుకుంటూ, పూనా ప్లీడర్లని తయారుచేసే

ఫాక్టరీగా భ్రమిస్తున్న అతగాడితో " లేదు," అన్నాను క్లుప్తంగా.

"అయితే నెహ్రూగా లెక్కడున్నారు ?" అన్నాడు.

" నాకు తెలీదు," అన్నాను.

"నెహ్రూ గొప్పా గాంధీ గొప్పా ?—చెప్పండి?" అన్నాడు మూడో ప్రశ్నలో.

బహుశా, పూర్వకాలంలో రాజకుమార్తెలు రాజకుమారుల్ని యిలాంటి ప్రశ్నలే వేసి, సమాధానాలు చెప్పలేకపోయారని తలలు ఖండించేవారు కాబోలు! నేనేం చెప్పగలను—నెహ్రూ గొప్పా, గాంధీ గొప్పా ? ఏ అమెరికీగారో సెలవియ్యాలి యిలాంటి విషయాలు.

ఇంతలో ధోండ్ స్టేషన్ వచ్చింది. పెట్టె బాగా పల్చబడింది. నంద్యాలమనిషీ జికరయ్యాలిల్లో సాపాటుచేశారు. నన్నుకూడా చెయ్యమన్నారు. చేసేబయద్దేరానని చెప్పుకున్నాను. విజయనగరం పూరీలతో పొట్టనింపుకున్నాడు—నెహ్రూ గొప్పా గాంధీ గొప్పా తేల్చిచెప్పలేని నా 'యింటెలిజెన్స్' మీద అతనికి కసింత గౌరవం తగ్గింది.

ధోండ్ దాటినతర్వాత రైలు, మస్తుగాతిని ఆవలిస్తూ ఆఫీసుకి బోయే గుమాస్తాలా నడవడం మొదలెట్టింది. జామపళ్లు తినమని నంద్యాల మనిషి ప్రతి పావుగంటకి రిమైండ్ చేస్తూనే వున్నాడు. ఎవర బల్లమీద కాస్త అయిష్టంగా కూచున్న ఒక సాయిబులమ్మాయి, పన్నెండేళ్లది, ముగ్గురు యోధుల మధ్యావున్న నన్ను పావుగంట నుంచి పరకాయించిచూస్తోంది. ఆ అమ్మాయికి ఎదురుగా అంటే నా బల్లమీదనే నాకు కాస్త ఎడంగా కూచున్న—ఒక మరాటీమనిషి మేం మాట్లాడే భాషని నోరు తెరిచి వింటున్నాడు. ఏమి టేమిటో అడిగారు వాళ్లు నన్ను. శిక్షన కీలూ, రిఫరెన్సు బుక్కులూ, లాబరేటరీలూ అవసరంలేని ప్రశ్నలకి సమాధానాలు చెప్పాను.

జకరయ్యు, "మీదేవూరు?" అని అడిగాడు.

"బెజవాడ ప్రాంతాల."

భాష్ను పోగొట్టుకోవడం యిష్టంలేని విజయు నగరం, "విజయునగరం ఎలావెళ్లాలి?" అన్నాడు.

"రాత్రి ఒంటిగంటకి ఈ బండి వాడీ వెళ్తుంది. అక్కడ దిగాలి. అక్కడ నైజాంబండి ఎక్కితే, అది తిన్నగా మర్నాడు సాయంత్రానికి బెజవాడ

తీసుకువెళ్తుంది. ఆ రాత్రి బెజవాడలో మకాం చేసి మూడోరోజు వుదయం కలకత్తామెయిల్ ఎక్కితే, అది విజయనగరం సాయంత్రం నాలుగు గంటలకి వెళ్తుంది," అని రైళ్లూ, రైనులూ, భోజనవసతులూ తత్సంబంధమయిన వన్నింటినీ గురించి విపులంగా ఒక పావుగంట ఉపన్యాసం యిచ్చినతర్వాత ... ...

"మద్రాస్ మీదుగా వెళ్లాలన్నాడే మా హావల్దారు," అన్నాడు నా రైలు శిష్యుడు.

"ఇంకో రోజు ఆలస్యమవుతుంది. చుట్టు ప్రయాణం."

"మా హావల్దార్ గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి వెళ్లాలన్నాడు. అది వాడీలో వుంటుందా?"

ఏమనను ? ఇంకాసేపు వుంటే ఆతగాడు నాకు ఎక్కాలు వచ్చునా రావా అని సంశయించేటట్లు వున్నాడు నంద్యాలమనిషి. నన్ని చెర నుంచి తప్పించి, తరవాత ఆగినస్టేషన్‌లో టీ గీ తెప్పించి, ముగ్గురి తరఫునా నన్ను సన్మానం చెయ్యడం మొదలెట్టాడు,—కవినీ నావలిస్ట్‌నీ అని తెలీక పోయినా.

నంద్యాలమనిషి జామపళ్ల సంగతి యింకోసారి

జ్ఞాపకం చేసి, తనో సిగరెట్టు ముట్టించి నాకొకటి యిచ్చాడు. గరమ్ గరమ్ ఛా తాగిన హుషా రులో అన్నాడు జటరయ్యతో: "నేను నంద్యా ల్లో దిగ్గానే భోగందానింటికి వెళ్లే మాట నిజం."

జటరయ్య కళ్లు తేలేసి చొంగకారుస్తూ, "అలాగా!" అన్నాడు. పాపం! అతనికి పెళ్లాం లేదు కాబోలు. ముగ్గురిలోకి కుర్రాడతను. కరు వురోజుల విషయం అతని స్ఫురణకి రాగా, బ్రాహ్మడి జందెంలాటి పేబుక్ తెరిచి, తనెంత నిలవ వుంచుకుంటున్నదీ, తల్లికి ఎంత పంపిస్తు న్నదీ నాకు చూపించాడు. తల్లి యింకో పదాది పోయిన తర్వాతో, పటాలం నుంచి వెనక్కి వచ్చిన తర్వాతో పెళ్ళి చేస్తానందట. నెలకి నలభై మూడున్నర సంపాయించే తను ప్రయోజకత్వా నికి మురిసిపోయే అమాయకపు జటరయ్యలు నా కళ్లముందు తాండవించారు. ఎన్ని ఆశలో, ఎన్ని కోర్కెలో ఆ వెర్రిహృదయాలలో!

విజయనగరం మాత్రం గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ వాడీ ఎందుకు రాదా అని ఆలోచిస్తున్నాడు.

నంద్యాలమనిషి అమాంత్రం జేబులోనుంచి ఒకపాకెట్ తీసి, దానిమీదరాసివున్న యింగ్లీషుకి

తెలుగు చెప్పమన్నాడు. అది మిలిటరీవాళ్ళకి నచ్చలేదు. అదే సుఖరోగాలమందు. ఫలానా అన్నాను. అతను అంతటితో తృప్తిపడలేదు. ఉపయోగించే విధానమూ పూర్తి వివరాలూ నాదగ్గిరనుంచి వినాలనివుంది. పాపం! అలావినడం అతనికి కొంత మానసిక సౌఖ్యాన్ని ఇస్తుంది.

నంద్యాలమనిషి తన పూర్వజీవితమంతా నాముందు - నాకు చెప్పాలనే అభిలాష ఎందుకో?- 'కన్‌ఫెస్' చేశాడు. ఆత్మకథలు పెద్దపెద్ద పుస్తకాలుగా రాసేవాళ్లు ఈ పాటి నిజాలు చెప్తూవుంటే చాలుననిపించింది.

నాలుగున్నర దాటింది. కురుద్వాడీ వచ్చింది. నేనక్కడ దిగి పోతాను. కూలివాడు నా సామాను దించాడు. విజయనగరం హడావిడిగా బెడ్డింగ్ చుట్టేసి, టోపీపర్దుకొని, పెట్టె చేతిలో పుచ్చుకున్నాడు.

"ఇదేమిటి?" అన్నాను, అతనితో.

"మీరూ బెజవాడేగా!—వాడీలో దిగాలన్నారుగా!"

"నేను బెజవాడ వెళ్తున్నానని అనలేదు. మా స్వగ్రామం బెజవాడ ప్రాంతాల—అన్నాను. ఇది

కరుబ్బాడీ—వాడీకాదు. వాడీ రాత్రి ఒంటిగంటకి వస్తుంది,'' అన్నాను.

నంద్యాలమనిషికీ జకరయ్యకీ విజయనగరాన్ని వేళాకోళం చెయ్యడానికి వీలు చిక్కింది. అతగాడి రెండు జబ్బలూ ఒకొకరూ పట్టుకున్నారు. ప్లాట్‌ఫారం మీదికి వచ్చి నాకు నమస్కారం చేశారు, గుర్రాలులేని ముగ్గురు రౌతులూ. అవ్యక్తంలో నుంచీ, అవివేకంలో నుంచీ తొంగిచూస్తున్న వారి తెనుగుతనానికి నా గుండె సానుభూతితో కొట్టుకుంది.

నంద్యాలమనిషి అమాంతం పెట్టెలోకి ఎక్కి, నేను మర్చిపోవాలని మర్చిపోయిన జామపళ్లు ఆరూ, రెండు చేతుల్లోనూ ఇముడ్చుకు వచ్చాడు. అన్నీ వద్దన్నాను. రెండైనా తీసుకోవాలన్నాడు. ఒక్కటి చాలన్నాను. అందుకే తృప్తిపడ్డాడా అల్పసంతోషి.

ఒకచేత్తో కారియరూ ఇంకోచేత్తో మిలటరీ జామపండూ పుచ్చుకు, యాస్పిరిన్ అడ్వర్టయిజ్‌మెంట్ తాలూకు 'ముగురు రౌతులు' ఫిలిం చూసి చాలా రోజులయిందనుకుంటూ, బార్సుబండి వైపుగా దారితీశాను. (నవంబరు 48)

కథా నిలయం
1138